క్లుప్తంగా

జ్వరపీడితులతో ప్రభుత్వాస్పత్రి కిటకిట

పాల్వంచ: విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో బాధితులు ఆస్పత్రులకు తరలివస్తున్నారు. పాల్వంచ ప్రభుత్వాస్పత్రిలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, ఒళ్లు నొప్పులు, జలుబు, తలనొప్పి, గొంతు నొప్పి వంటి సమస్యలతో పలువురు చికిత్స పొందుతున్నారు. బూర్గంపాడు మండలం సోంపల్లి గ్రామంలో జ్వరాలు విజృంభించగా, బాధితులు పాల్వంచ ఆస్పత్రిలో చేరుతున్నారు. మూడు, నాలుగు రోజుల నుంచి సుమారు 200 మంది వరకు ఇక్కడ చికిత్స పొందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వర రావును సాక్షి వివరణ కోరగా.. సోంపల్లి జ్వర బాధితులతో వార్డులన్నీ నిండిపోయాయని, అయితే ఎవరికీ సీరియస్ కాలేదని తెలిపారు. చికిత్స అందించి పంపిస్తున్నామని, సోంపల్లి గ్రామంలో కూడా వైద్యసేవలు అందిస్తున్నారని వివరించారు.

శ్రీకాంత్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

ఇల్లెందురూరల్: తెలంగాణ ఉద్యమ అమరుడు రామటెంకి శ్రీకాంత్ 12వ వర్ధంతిని మాణిక్యారం గ్రామంలో ఆదివారం నిర్వహించారు. గ్రామంలోని ఆయన స్మారక స్తూపానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వివిధ రాజకీయ పక్షాల నాయకులు మాట్లాడుతూ.. ఉన్నతం చదువులు చదివిన శ్రీకాంత్ తెలంగాణ కోసం పరితపించేవాడని, ఎంతగా ఉద్యమం కొనసాగుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆత్మబలిదానం చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా బోనాలు

టేకులపల్లి: తొమ్మిదో మైలుతండా సాయనపేట గ్రామంలో ఆదివారం బోనాలు, వన భోజనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి గ్రామ దేవతలకు పూజలు చేశారు. ముత్యాలమ్మ గుడికి ప్రదక్షిణలు చేసి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మద్రాస్‌తండాలో బంజారాలు వనభోజన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తొలిపండుగ సీత్లా తరువాత తీజ్ పండుగకు ముందు వనభోజనాలకు వెళ్లడం ఆనవాయితీ. ఇందులో భాగంగా తండావాసులు ఆటపాటలతో సందడి చేస్తూ వేడుక జరుపుకున్నారు.

యువకుడి ఆత్మహత్య

టేకులపల్లి: కుటుంబ కలహాలతో ఓ యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. టేకులపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి తెలిపిన వివరాలు.. తొమ్మిదోమైలు తండాకు చెందిన నూనావత్ వీరన్న(23)కు భార్యతో గొడవలు జరుగుతున్నాయి. ఆమె నిండు గర్భిణీ. జీవనోపాధికి పని చేయాలని భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో మనస్థాపం చెందిన వీరన్న ఈనెల 3న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బస్టాండ్ లేక ప్రయాణికుల ఇక్కట్లు

- ఎండైనా, వానైనా రోడ్డు మీదే పడిగాపులు
- పట్టించుకోని అధికారులు
- బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని వేడుకోలు



సుజాతనగర్ మండల కేంద్రం

సుజాతనగర్: ఓ వైపు ఎండలు, మరో వైపు వర్షాలు.. మండలకేంద్రంలో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్టాండ్ కానీ, కనీసం తాత్కాలిక షెడ్డు కూడా ఇక్కడ లేదు. నిలువ నీడ లేక చెట్లను, దుకాణాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి. ఇటు స్థానిక ప్రజాప్రతినిధులు అటు ఆర్టీసీ అధికారులు పట్టించుకోక పోవడం ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

మండుటెండలోనే పడిగాపులు...

మండలాల పునర్విభజనలో భాగంగా 2016లో సుజాతనగర్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సుమారు 33 వేల జనాభా ఉంది. మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గ్రామాల్లో తాత్కాలిక షెల్టర్ల మాట అటుంచితే కనీసం మండల కేంద్రంలో బస్టాండ్ కానీ, తాత్కాలిక ఏర్పాటు కానీ లేదు. దీంతో మండల కేంద్రానికి వచ్చిపోయే ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. కనీసం బస్‌షెల్టర్ కూడా లేకపోవడంతో ప్రయాణికులు ఎండలో ఎండుతూ... వానలో తడుస్తూ... బస్సు వెళ్లిపోతుందేమోననే కంగారులో రోడ్డు పైనే వేచి ఉంటున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. కనీసం బస్సులు ఆపడానికి రోడ్డుపై స్థలం లేకపోవడంతో డ్రైవర్లు బస్సులను రోడ్డుపైనే ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. సుజాతనగర్ ప్రధార సెంటర్‌లో ఎండలో ఉండలేక దుకాణాల వద్ద బస్సుల కోసం ప్రయాణికులు వేచి ఉంటే, వ్యాపారానికి అడ్డుగా ఉన్నారని వారిపై ఆయా యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక ప్రయాణికులు బస్సులు, ఆటోల కోసం రోడ్డుపైనే లగేజీ, పిల్లాపాపలతో వేచి ఉంటున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో జిల్లా కేంద్రం కొత్తగూడెంతో పాటు, పాల్వంచ మండలంలో ఉమ్మడి జిల్లాలో బస్టాండ్‌లు నిర్మించారు. మిగిలిన మూడు మండలాల్లో కనీసం తాత్కాలిక ఏర్పాట్‌లైనా లేవు.

మహిళల అవస్థలు..

మండల కేంద్రంలో బస్సు కోసం వేచి చూసే ప్రయాణికుల కొరకు కనీసం ఎటువంటి సౌకర్యాలు లేకపోవడం వలన ముఖ్యంగా మహిళల పరిస్థితి దారుణంగా ఉంటోంది. తాగునీటి సౌకర్యం, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఆర్టీసీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. మండలం నుంచి ప్రతినిత్యం వివిధ పనుల నిమిత్తం హైదరాబాద్, ఖమ్మం, కొత్తగూడెం తదితర పట్టణాలకు వెళ్తుంటారు. ఈ క్రమంలో ఎండలోనే వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్టీసీకి ప్రయాణికుల ద్వారా ఆదాయం మెండుగా ఉన్నా సౌకర్యాలపై శ్రద్ధ చూపడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ కానీ బస్‌షెల్టర్ కానీ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



సుజాతనగర్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

అధికారులు చర్యలు తీసుకోవాలి



ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా బస్టాండ్ నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎండతీవ్రతకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండ, వానలను దృష్టిలో ఉంచుకొని బస్టాండ్‌ను నిర్మించాలి.

– చారుగుండ్ల ప్రసాద్, సుజాతనగర్

ఇబ్బందులు గుర్తించాలి



వర్షాకాలంలో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం బస్‌షెల్టర్ అయినా నిర్మించాలి. మహిళల ఇబ్బందుల దృష్ట్యా మండల కేంద్రంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలి.

– గూని శ్రీనివాసరావు, సుజాతనగర్

ప్రజాప్రతినిధులు ముందుకు రావాలి



స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులు తీర్మానం చేసుకొని బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. బస్టాండ్‌లు నిర్మించాలంటే ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

– బాణాల వెంకటేశ్వరరావు, ఆర్టీసీ డిపో మేనేజర్, కొత్తగూడెం

జీపీ కార్మికుల వినూత్న నిరసన



దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్మికులు

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని కార్మికులు ఆదివారం వినూత్న నిరసన చేశారు. సమ్మెలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నిరసన దీక్ష శిబిరం వద్ద దున్నపోతుకు వినతిపత్రం అందజేసి, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తప్పుబట్టారు. జేఏసీ నాయకులు జటంగి వెంకన్న, తొగర సామేలు మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్లతో సమ్మె చేస్తున్న తమపై ప్రభుత్వ వైఖరి ఆవేదనకు గురిచేస్తోందన్నారు. గ్రామాలలో పారిశుద్ధ్య పనులు చేస్తూ తెలంగాణ పల్లెలను జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ఘనతలో తమ భాగస్వామ్యం ఉందని, కానీ అవార్డులు అందుకున్న ప్రభుత్వం.. కార్మికుల సంక్షేమంపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో మోహన్‌రావు, నర్సింహారావు, గోపి, కిరణ్, సుమ పాల్గొన్నారు.

రోడ్డుపై బర్త్ డే పార్టీ.. కేసు నమోదు

పాల్వంచ: రోడ్డుపై బర్త్‌డే పార్టీ చేసుకుంటున్న మిత్రులపై ఆదివారం కేసు నమోదు అయింది. పోలీసుల కథనం.. పట్టణంలోని వనమా కాలనీకి చెందిన రమేశ్ శనివారం రాత్రి తన పుట్టిన రోజును రోడ్డుపై జరుపుకుంటున్నాడు. డప్పువాయిద్యాలు ఏర్పాటు చేసి, నృత్యాలు చేస్తూ హంగామా చేస్తున్నారు. దీంతో కాలనీవాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్లూకోడ్ సిబ్బంది అక్కడికి చేరుకుని రమేశ్, అతని స్నేహితులు వీరన్న, ఆనంద్, రమేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాణాల రాము తెలిపారు. రోడ్లపై, ఇతరులకు ఇబ్బంది కలిగించేలా సంబురాలు జరుపుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ప్రజల శాంతిని భంగం కలిగించరాదని హెచ్చరించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ సూచన మేరకు రాంపురం గ్రామ పంచాయతీలో సీసీ రోడ్లు నిర్మించేందుకు డీఎంఎఫ్ నిధులు రూ.70 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం రాంపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ భూక్యా ఇందిర, ఎంపీటీసీ బానోతు సరోజిని శంకుస్థాపన చేశారు. ఉప సర్పంచ్ ఇ.రవి, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు భూక్యా రమేష్, నూనావత్ బాలు, జి.రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న మధుచంద్

పాల్వంచ: పట్టణంలోని పాత పాల్వంచకు చెందిన చారి, జయలక్ష్మిల 13 సంవత్సరాల కుమారుడు పార్థు కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం రూ.2లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో స్పందించిన ఎంబీ యూత్ అధ్యక్షుడు బత్తుల మధుచంద్ ఆదివారం బాలుడి ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్‌లోని సింగరేణి పాఠశాలలో 1993–94 పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమ్మక్క – సారలమ్మ గద్దెల వద్ద ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్ననాటి స్నేహితులందరూ యూనిఫాం ధరించి ఒకచోట కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలలో ఎక్కడెక్కడో స్థిరపడడంతో గత స్మృతులను నెమరువేసుకుంటూ తమ అనుబంధాలను పంచుకున్నారు. హనోక్ రాజు, జోసఫ్, బోంతు శ్రీనివాస్, నర్సింహారావు, వరప్రసాద్, రాంచందర్, రాజేంద్ర ప్రసాద్, కంచ శ్రీనివాస్, అలీ, రామకృష్ణ, నూతన్‌బాబు, సారయ్య, ధన్‌రాజ్, రమేష్, ప్రేమ్‌కుమార్, విజయ్, సంపత్, రవి, రామారావు, అమృతకుమారి, పద్మ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ కాంగ్రెస్ పార్టీ



పాల్వంచరూరల్: మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచరూరల్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. ఆదివారం గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా ముందుగా పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం రంగాపురం గ్రామంలో ఎడవల్లి కృష్ణ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. రెండుసార్లు అధికారం చేపట్టిన బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రానికి చేసింది శూన్యం అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. ఎన్నికల హామీలను విస్మరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు బురద చల్లుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వంటగ్యాస్ సిలిండర్ రూ.500కే ఇస్తామన్నారు. సొంత ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, రైతులకు రుణమాఫీ, పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో నూకల రంగారావు, కొండం వెంకన్నగౌడ్, కట్ట సోమయ్య, జలీల్, బద్దికిషోర్, బత్తుల వెంకటేశ్వరరావు, దేవేందర్, మంజ్యానాయక్, రామారావు, లోగాని మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ నేత గుండెబోయిన నాగమణి అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం ఆమె పర్యటించి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సహజసిద్ధంగా నీటివనరులు కలిగిన ఇల్లెందు నియోజకవర్గంలో నేటికీ యాభై శాతం భూభాగం వార్షాధారంపైనే ఆధారపడి రైతున్నలు సాగు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్టు ఇల్లెందుకు ఎందుకు దూరమయ్యిందో చెప్పాలన్నారు. కార్యక్రమంలో మోహిన్, కృష్ణ, స్వామి పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు చేయాలి



నినాదాలు చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

ఇల్లెందురూరల్: రాష్ట్ర వ్యాప్తంగా 15 శాఖల్లో వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విధానాన్ని రద్దు చేయాలని జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం అత్యవసరంగా ఏర్పాటైన సమావేశంలో పలు తీర్మానాలు చేసి ప్రభుత్వానికి విన్నవించనున్నట్లు తెలిపారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. వివిధ శాఖల్లో 15 – 20 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలను సైతం నెలవారీ కాకుండా మూడు నుంచి ఆరు నెలలు మధ్య కాలంలో చెల్లించడం జరుగుతోందన్నారు. దీనివల్ల ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. మూడు సంవత్సరాల లోపు కాలపరిమితిలో ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఏఎంసీలను రద్దు చేసి నేరుగా ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని కోరారు. మృతి చెందిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీవన భృతి కింద ఆర్థిక సహాయం అందించడంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కొండారెడ్డి, సుస్మిత, రషీద్, నర్సింహ, శేషయ్య, శ్రీనివాస్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై తిరగబడదాం..



ప్రదర్శన నిర్వహిస్తున్న ఏఐటీఎఫ్ నాయకులు

ఇల్లెందురూరల్: మణిపూర్ ఆదివాసీలపై దాడులను ఖండిస్తూ అటవీ సంరక్షణ నియమాలను పార్లమెంటు ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ.. పోడు భూముల రక్షణ, పట్టాలకై డిమాండ్ చేస్తూ ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అఖిల భారత ట్రైబల్ ఫోరం (ఏఐటీఎఫ్) సభ్యుడు సూర్నపాక నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

మండలంలోని మిట్టపల్లి, ఒడ్డుగూడెం, రొంపేడు గ్రామాలలో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాలక ప్రభుత్వాలు ఆదివాసీలపై సవతితల్లి ప్రేమను చూపిస్తున్నాయని విమర్శించారు. అడవిని, నేలను నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసీలను అడవి నుంచి వెళ్లగొట్టే కుట్ర జరుగుతోందన్నారు. దేశంలోని ఆదివాసీలంతా ఒక్క తాటిమీద కొచ్చి ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తూ ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో రాంబాబు, కృష్ణ, వీరస్వామి, శివ, భద్రమ్మ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన న్యాయవాదుల శిక్షణ



మాట్లాడుతున్న రమేష్‌కుమార్ మక్కడ్

కొత్తగూడెంటౌన్: న్యాయవాదులకు అవగాహన కల్పించేందుకు కొత్తగూడెం రైటర్‌బస్తీలోని ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన న్యాయవాదుల శిక్షణ ఆదివారంతో ముగిసింది. కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, చీఫ్ డిఫెన్స్ లీగల్ కౌన్సిల్ వి.పురుషోత్తం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులకు జిల్లా వ్యాప్తంగా 200 మందికి పైగా న్యాయవాదులు హాజరైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రజా గాయకుడు గద్దర్ మరణానికి సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో లక్కినేని సత్యనారాయణ, ఎస్.భానుప్రియ, పాండురంగ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా యుద్ధ'నౌక' దిగిన గద్దర్

ప్రజా గాయకుడు గద్దర్ మృతికి అఖిలపక్ష నాయకులు సంతాపం ప్రకటించారు. ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. పలువురు మాట్లాడుతూ.. జననాట్యమండలి వ్యవస్థాపకుడు, ప్రజాయుద్ధ నౌక గద్దర్ తన గళంతో ప్రజలను చైతన్యవంతుల్ని చేశారని కొనియాడారు. పీపుల్స్‌వార్, మావోయిస్టు, తెలంగాణ ఉద్యమంలో ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమ కెరటం గద్దర్ అన్నారు. ఆయన అసలు పేరు గుమ్మడి విఠల్‌రావు కాగా, పలు విప్లవ పాటలను రచించారని, మొదటి ఆల్బం పేరు గద్దర్. అదే ఆయన పేరుగా స్థిరపడిందని పేర్కొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



పాల్వంచ: నివాళులర్పిస్తున్న తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం నాయకులు



టేకులపల్లి సెంటర్‌లో కొవ్వొత్తులతో గద్దర్‌కు సంతాపం తెలుపుతున్న అఖిలపక్షం నాయకులు

అటెన్షన్ ప్లీజ్

రోడ్డుపై కల్వర్టుతో ప్రమాదం..!

ఖమ్మం, కొత్తగూడెం ప్రధాన రహదారి స్థానిక రైల్వే వంతెన సమీపంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణంలో ఇక్కడ కల్వర్టు నిర్మించి దానిమీదుగా తారు రోడ్డు వేశారు. క్రమేణా కల్వర్టు స్లాబ్‌కు అటు ఇటు రోడ్డు కుంగి కల్వర్టు పైకి తేలింది. వాహనాలు ఇక్కడికి వచ్చేంత వరకూ రోడ్డు ఎగుడు దిగుడు ఉందనే విషయం తెలియక వాహనాలకు షడన్ బ్రేక్ వేయడంతో ప్రయాణికులు కుదుపులకు గురవుతున్నారు. మరమ్మతులు చేపట్టి రోడ్డును సరిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. – సుజాతనగర్



ప్రశ్నించాల్సిన అధికారి : శివగణేష్,
ఆర్అండ్‌బీ ఏఈ
ఫోన్ నెంబర్: 9440819020

తెలంగాణ ఆకాంక్షల ప్రతిరూపం జయశంకర్

తెలంగాణ స్ఫూర్తి ప్రదాత, సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జయశంకర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించారని, ఆ మహనీయుని ఆశయాల సాధనకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: మున్సిపల్ కార్యాలయంలో..



కొత్తగూడెంఅర్బన్: జిల్లా గ్రంథాలయంలో..



చుంచుపల్లి: హౌజింగ్‌బోర్డు సొసైటీ కార్యాలయంలో..



కొత్తగూడెంటౌన్: నివాళులర్పిస్తున్న కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్



కొత్తగూడెంఅర్బన్: మున్సిపల్ కార్యాలయంలో..



పాల్వంచ: కేటీపీఎస్‌లో పూలమాల వేస్తున్న సీఈ



జూలూరుపాడు: తహసీల్‌లో నివాళులర్పిస్తున్న ఆర్ఐ తిరుపతిరావు, వీఆర్ఏలు



పాల్వంచ: మున్సిపల్ కార్యాలయంలో..



టేకులపల్లి: పంచాయతీ కార్యాలయంలో...



ఇల్లెందురూరల్: సెర్ప్ కార్యాలయంలో..



పాల్వంచరూరల్: గురుకుల కళాశాలలో...